

పూల బొకేలు తీసుకురావద్దు



ప్రజాశక్తి- శ్రీకాకుళంప్రతినిధి

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అభిమానులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పూల బొకేలు, గజమాలలు, శాలువలు తీసుకురావద్దని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిండు మనస్సుతో అభిమానంతో వస్తే చాలన్నారు. బొకేలు, పూల మాలలు, దుశ్శాలువలు తెచ్చే వారు అదే ఖర్చుతో 'చదువుకునే పేద విద్యార్థులకు' ఉపయోగపడే విధంగా పుస్తకాలు, పెన్నులు అందించాలని అన్నారు.

ఆగని అక్రమ వసూళ్ల దందా

- ఎచ్చెర్ల ఎఎంసి చెక్‌పోస్టు వద్ద ప్రయివేట్ వ్యక్తులదే రాజ్యం
- వసూలు చేసిన సొమ్ము తమ జేబుల్లో వేసుకుంటున్న వైనం
- ఉద్యోగాల నుంచి తొలగించినా అక్కడే విధులు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్‌శాఖ అధికారులు



చిలకపాలెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు వదిలేసి వెళ్లిపోతున్న ఉమామహేశ్వరావుతో పాటు ప్రయివేట్ వ్యక్తులు (ఫైల్)

ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఎఎంసి) అక్రమాలకు అడ్డాగా మారింది. ఉద్యోగుల ముసుగులో కొందరు బినామీలు అడ్డగోలుగా సొమ్ములు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయోత్పత్తుల ద్వారా వచ్చే సెస్ డబ్బుల్లో కొంత భాగాన్ని తమ జేబుల్లో వేసుకుని, స్వల్ప మొత్తాన్ని రసీదుల రూపంలో చూపిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. గతంలో ఇదే కమిటీలో వాచ్‌మెన్‌గా పనిచేసిన గొర్లె ఉమామహేశ్వరరావుపై అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినా అక్కడే ఉండి ఈ నెల 23న ఒకసారి, 28న రెండో సారి చెక్‌పోస్టు వద్ద ఆ వ్యక్తి వసూళ్లకు పాల్పడిన ఘటనలు వెలుగు చూశాయి. ఇంత జరుగుతున్నా మార్కెటింగ్‌శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, లావేరు

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై ఎఎంసి ఆధ్వర్యాన్న చెక్‌పోస్టు నడుస్తోంది. ధాన్యం, మొక్కజొన్న, కూరగాయలు, నీలగిరి, సరుగుడు, తదితర వ్యవసాయోత్పత్తులపై మార్కెటింగ్‌శాఖ సెస్ రూపంలో డబ్బులు వసూలు చేస్తోంది. వసూలు చేసిన సొమ్ములకు సిబ్బంది రసీదులను వారికి అందజేస్తారు. ఇంత వరకు బాగానే ఉన్నా అక్కడ గత కొంతకాలంగా సాగుతున్న అక్రమ దందా చూస్తే కళ్లు బైర్లు కమ్మకమానవు. రెగ్యులర్ ఉద్యోగులు చేయాల్సిన పనిని ప్రయివేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారు. డబ్బులు వసూలు దగ్గర నుంచి రసీదులు ఇచ్చేవరకు అంతా వారే చూసుకుంటున్నారు. తమకు తోచినంత బిల్లు రాసి, అందులో కొంత సొమ్మును తమ జేబులోకి వేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారి కావడంతో రోజుకు వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసే వాహనాల సంఖ్య వందల్లో ఉంటున్నా వీరు మాత్రం వాటిని తగ్గించి పదుల సంఖ్యలో చూపుతున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఈ నెల 27న 24 గంటలు పనిచేసి 12 వాహనాల నుంచి మాత్రమే రూ.21,921 వసూలు చేశారు. మరోవైపు సెస్ వసూలు పరిధిలోకి రాని వాహనాలను సైతం ఆపి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాహనాలను ఆపకుండా వెళ్లిపోతే వారిని వెంబడించి మరీ సొమ్ములు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినివస్తున్నాయి.

ఇదేం విజిలెన్స్ టీం?

ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలో సాగుతున్న దోపిడీపై ఈ నెల 24న 'ప్రజాశక్తి'లో 'ఎచ్చెర్ల ఎఎంసిలో దోపిడీ' అనే శీర్షికతో రాసిన కథనం తర్వాత మార్కెటింగ్‌శాఖ అధికారులు ఒక విజిలెన్స్ టీం ఏర్పాటు చేశారు. అదే శాఖకు చెందిన పొందూరు ఎఎంసి కార్యదర్శి, ఒక సూపర్ వైజర్, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను సభ్యులుగా నియమించారు. ఎఎంసి చెందిన ఉద్యోగుల ప్రమేయంతోనే ప్రయివేట్ వ్యక్తుల దందా కొనసాగిస్తుంటే వారి ఆగడాలను విజిలెన్స్ టీం సభ్యులు ఏవిధంగా అడ్డుకోగలరనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎఎంసి రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలకు సిఫార్సు చేసే ధైర్యం విజిలెన్స్ టీం చేయగలదా? అనే సందేహాలూ లేకపోలేదు.

అధికారులకు తెలిసే జరుగుతుందా?

చిలకపాలెం చెక్‌పోస్టు వద్ద ప్రయివేట్ వ్యక్తులు బహిరంగంగానే డబ్బులు వసూలు చేస్తున్నారు. సామాన్య జనానికి ఎఎంసి ఉద్యోగులు ఎవరు, ప్రయివేట్ వ్యక్తులు ఎవరనేది తెలియకపోయినా మార్కెటింగ్‌శాఖ అధికారులకు మాత్రం తెలుస్తుంది. ఇంత జరుగుతున్నా వారు ఎందుకు మౌనం వహిస్తున్నారనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. తమ ఉద్యోగులు కాకుండా వేరే వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్న వారిపై పోలీసు కేసు ఎందుకు పెట్టలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ వసూళ్ల తతంగమంతా మార్కెటింగ్‌శాఖ అధికారులకు తెలిసే జరుతున్నాయా అనే సందేహాలు రేకెత్తుతున్నాయి.

సస్పెండైన వాచ్‌మెన్‌కు అక్కడేం పని?

ఎచ్చెర్ల ఎఎంసిపై గతంలోనే అవినీతి మరక అంటించుకుంది. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల ఎఎంసిల్లో సెక్రటరీగా పనిచేసిన సమయంలో ఉద్యోగి సువ్వారి చిన్ని అనే ఉద్యోగి 2019 రూ.3 కోట్ల 22 లక్షల 57 వేల 819 దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. నిధుల దుర్వినియోగాన్ని గుర్తించడంలో విశాఖ మార్కెటింగ్‌శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.ఎర్రన్న, శ్రీకాకుళం సహాయక సంచాలకులు బి.శ్రీనివాసరావు విఫలమయ్యారంటూ ఇరువురినీ సస్పెండ్ చేశారు. వీరితో పాటు సస్పెండ్ అయిన వారిలో ఏడుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులూ ఉన్నారు. వీరిలో వాచ్‌మెన్‌గా ఉన్న గొర్లె ఉమామహేశ్వరరావు ప్రస్తుతం చిలకపాలెంలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారు.

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకుంటాం

చిలకపాలెం చెక్‌పోస్టు వద్ద జరగుతున్న అక్రమ వసూళ్ల విషయం తన దృష్టికి వచ్చింది. చెక్‌పోస్టు వద్ద ప్రయివేట్ వ్యక్తులు ఎవరూ ఉండకూడదు. రెగ్యులర్ ఉద్యోగులు కాకుండా అక్కడ ఎవరైనా ఉంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. ఇప్పటికే విజిలెన్స్ టీం ఏర్పాటు చేశాం. రోజూ ఎంత మేర సొమ్ము వసూలవుతోంది, ఎంత జమ అవుతుందనే విషయాలను పరిశీలిస్తాం.

– బి.రవికిరణ్, మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు



మాట్లాడుతున్న రామ్మోహన్

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్
- ముగిసిన జిల్లా మహాసభలు
- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పవిత్ర, చందు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ అన్నారు. స్థానిక శుభం కళ్యాణ మండపంలో భారత విద్యార్థి ఫెడరేషన్ 43వ జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిసింది. ముందుగా ఈ మహాసభలు ప్రారంభ సూచికగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిప కూటమి ప్రభుత్వం స్పందించి ప్రభుత్వం కళాశాలల్లో వసతులు కల్పించాలన్నారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. ఉన్నతాధికారులు స్కూళ్లు, కళాశాలలు, హాస్టళ్లను పరిశీలించాలన్నారు. హనర్స్ డిగ్రీ మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలు భవిషత్ కర్తవ్యాలు వేదికగా ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని 15 మందితో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పి.పవిత్ర, జిల్లా కార్యదర్శిగా డి.చందు, ఉపాధ్యక్షులు యు.దుర్గాప్రసాద్, సిహెచ్.రాజు, సహాయ కార్యదర్శులుగా ఎం.సంతోష్‌కుమార్, కె.ఖాగేష్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి.హరీష్, చిన్నారావు, దివ్య, పుష్ప, సంతు, ఉమా, మహేష్, నవీన్, రాము, జయరాంలను ఎన్నుకున్నారు.


సమస్యలు పరిష్కరించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలే తప్ప వాస్తవాల్లో విద్యార్థుల సమస్యలపై సరైన పరిష్కారాలు చూపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తుంది. ఇది మంచి ప్రభుత్వమని తమకు తామే ఒక గుర్తింపు కార్డును ఇచ్చుకునే పరిస్థితిలో ఉన్నాయి. కానీ, రాష్ట్రంలోని విద్యా సమస్యలపై ఎటువంటి స్పందన లేదు. ఇప్పటికే విద్యార్థుల సత్తా ప్రపంచ రాజకీయ పరిస్థితులనే మార్చే దిశగా అడుగులు వేస్తుంది. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే అటువంటి సమాధానమే చెప్పాల్సి వస్తుంది.

– పి.పవిత్ర, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి



త్వరగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయులను నియమించాలి. విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలి. కళాశాలల్లో, పాఠశాలల్లో వసతి సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వసతులను కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి.

– డి.చందు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం

జెవివి రాష్ట్ర కార్యదర్శి గిరిధర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిధర్, తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మద్యపానం, డ్రగ్స్‌కు వ్యతిరకంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన విద్యార్థుల్లో ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించడానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త సంవత్సరమంతా ప్రజలంతా సంతోషంగా జీవించాలన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన యురేకా సైన్స్ ఎక్స్పో ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత ప్రయోగాలు రూపకల్పన చేసి తయారు చేసిన వీడియోలపై ఆన్‌లైన్ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ఆన్‌లైన్ వీడియో కాంటెస్టులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రైతు ఉద్యమ నేత జస్విందర్ దల్లేవాల్ దీక్షకు రైతు ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ప్రభుత్వాలు స్పందించి రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా వ్యవస్థాపక కార్యదర్శి కొత్తకోట అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పర్యావరణ సబ్ కమిటీ కన్వీనర్, యురేకా సైన్స్ ఎక్స్పో ప్రతినిధి పూజారి గోవిందరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనవరి 10,11న జెవివి అధ్యయనం చేసి అధికారులకు నివేదిస్తామన్నారు. సమతా జిల్లా నాయకులు తంగి ఎర్రమ్మ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సూర స్వర్ణకుమారీలు మాట్లాడుతూ జనవరి 3 ప్రథమ మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబా పూలే జయంతిని విద్యాలయాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన హైస్కూల్ విద్యార్థులకు 'చిక్కోలు చిన్నోళ్ల కథలు' (శ్రీకాకుళం పిల్లల కథలు) పేరిట పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్.సురేష్‌బాబు, జెవివి ప్రతినధులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పిరియాట్రిక్ వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా డ్రగ్స్ నిర్మూలనపై మహాసంకల్ప అవగాహనా సదస్సు ఆదివారం నిర్వహించారు. ముందుగా 5కె వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గంజాయి జడలు విప్పి యువత, విద్యార్థులను మత్తులో ముంచి వారి జీవితాలను నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువత తమ జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకుంటున్నారన్నారు. గంజాయి సాగు, రవాణా, వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు చేపడుతుందన్నారు. మహాసంకల్పం కార్యక్రమం ద్వారా యువతకు, విద్యార్థులకు గంజాయి, సైబర్ క్రైం గురించి అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఒకప్పుడు చోరీలు, దారిదోపిడీలు, మహిళలపై అఘాత్యాలు, తగాదాలు వంటి నేరాలు ఎక్కువుగా ఉండేవని, ఇప్పుడు ప్రధాన నేరాలుగా డ్రగ్స్, సైబర్ క్రైం ప్రజల జీవితాలనే నాశనం చేస్తున్నాయని అన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి చాలామంది కష్టపడి సంపాదించుకున్న సొమ్మును పోగొట్టుకుంటున్నారన్నారు. దేశ స్థితిగతులు మార్చగల శక్తి యువతకి ఉందన్నారు. మంచి మార్గాన పయనించి జీవితాలను చక్కదిద్దు కోవాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి నేరాలకు తెగబడుతున్నారని, ఇది ఆందోళన కరమైందని అన్నారు. విచ్చల విడిగా అడ్డ దారిలో డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతోనే ఎక్కువ మంది గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల యువత జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. సైబర్ క్రైం గురించి తల్లిదండ్రులకు, బంధువులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, ఐతమ్ కళాశాల అధ్యాపకులు ప్రొఫెషర్ విష్ణుమూర్తి, ఎక్సైజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.




5కె రన్‌లో పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కొనసాగుతున్న డ్రోన్ల నిఘా



శ్రీకాకుళం: గంజాయి వినియోగానికి శ్రీకాకుళం పట్టణ శివారు ప్రాంతాల్లో అనుకూలంగా ఉండే ప్రదేశాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఆదివారం కొనసాగింది. బహిరంగంగా మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి వినియోగించిన వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సింగుపురం, ఖాజీపేట, పాత్రునివలస, సిద్ధిపేట, మునసబుపేట టిడ్కో గృహ సముదాయాలు, ఖాజీపేట, శ్రీకాకుళం గ్రామీణ మండలం, పరిసర ప్రదేశాల్లో పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్‌స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగించిన పేకాట ఈవ్ టీజింగ్ తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని పట్టుబడినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నారు. శ్రీకాకుళం పట్నం డ్రోన్ కెమెరాల నిఘా నీడలో ఉందని, యువత మత్తు పదార్థాలకు బానిసై నిర్మాణష్యమైన ప్రదేశాల్లో తిరగవద్దని, ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు.

రాకాసి అలలకు బోటు ధ్వంసం



బోటులోకి చేరిన నీరు

ఇచ్ఛాపురం : మండలంలోని డొంకూరు సముద్రంలో లంగర్ వేసిన బోటు అలల తాకిడికి మునిగి ధ్వంసమై తీవ్ర నష్టం వాటిల్లింది. డొంకూరుకు చెందిన బడే చిన్నారావుతో పాటు మరి కొంతమంది మత్స్యకారులు కలిసి సముద్రంలో వేట సాగించేందుకు శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వెళ్లారు. వేట ముగించుకుని ఆదివారం వేకువ జామున తీరానికి చేరుకున్నారు. తీరానికి సమీప ప్రాంతం సముద్రంలో బోటును లంగర్ వేసి ఇళ్లకు వచ్చేశారు. ఇంతలోనే రాకాసి అలలు తాకిడికి లంగర వేసిన బోటు మునిగి ధ్వంసమైంది. ఈ ఘటనలో రూ.ఐదు లక్షల మేర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని తోటి మత్స్యకారులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక శోభ

- అలరించిన జాతీయస్థాయి నాటక పోటీలు
- 150 ఏళ్ల నాటి కన్యాశుల్కం ప్రదర్శన
- రంగోయిలో జానపద కళా ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కళలకు పుట్టినిల్లుగా చెప్పుకునే జిల్లాలో గడుస్తున్న 2024లో వివిధ కళా ప్రదర్శనలతో సాంస్కృతిక శోభ సంతరించుకుంది. భారతీయ కళా సాంస్కృక ప్రదర్శనలు, మేటి ప్రవచన కర్తల ప్రసంగాలు, అరసవల్లిలో ఏడాది పొడవున సాగిన ధర్మపథం సాంస్కృతిక వేడుకలకు తోడు కళారంగాన్ని ఆదరించే వివిధ సాంస్కృతిక సంస్థల నుంచి కళారంగాన్ని ఆదరిస్తున్నారు. ఏడాది పొడవునా ఆ ఆదరణ కొనసాగింది. నగరంలోని తుమ్మావీధిలో జనవరి 1న సంప్రదాయ బద్ధంగా ముగ్గుల పోటీలతో రంగవల్లిక మొదలైంది. ఆటపాటలతో సాగిన ఈ వేడుకలను నగర ప్రజలను ఆకట్టుకున్నారు. ఏటా ప్రభుత్వం శ్రీకాకుళం వేదికగా నిర్వహించే సంక్రాంతి సంబరాలు మాత్రం ప్రజలకు దూరమయ్యాయి. పలు కళావేదికలు వివిధ ప్రదర్శనలకు ఆతిధ్యమిచ్చాయి. పలాస మండలం రంగోయిలో ఏటా మాదిరిగా సంక్రాంతి సందర్భంగా జనవరి 12,13,14, తేదీల్లో జానపద కళలను ప్రదర్శించారు. ఈసారి అంతర్రాష్ట్ర జానపద కళల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లాలోని నృత్య దర్శకులు నాంప్రదాయం వ్యవస్థాపకులు స్వాతి సోమనాథ్, నీరజా సుబ్రహ్మణ్యం, రఘుపాత్రుని శ్రీకాంత్, శివ, మంది దివ్య తదితర కళాకారులు తమ శిష్య బృందాలతో దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి నృత్య ప్రదర్శనలు ఇచ్చి జిల్లా ఖ్యాతిని పెంచారు. అలాగే సుమిత్ర కళాపమితి ఆధ్వర్యాన మార్చి 27 నుంచి 30 వరకు జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహించారు. 150 చరిత్ర ఉన్న కన్యాశుల్కం వంటి ప్రాచీన నాటకాల ప్రదర్శనకు బాపూజీ కళామందిర్ వేదికైంది. రాష్ట్రంలోనే కాక ఇతర ప్రాంతాలకు చెందిన తెలుగు నాటక పరిషత్‌లు ఈ పోటీల్లో పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శనల్లో కళాభిమానులు కనువిందు చేసుకున్నారు. నగరంలోని ఆక్స్‌ఫర్డ్, న్యూసెంట్రల్ స్కూల్, సాయి విద్యామందిర్ వంటి ప్రయివేటు స్కూళ్లలో ఏటా మాదిరాగానే సంక్రాంతి సందర్భంగా గంగిరెద్దులాటలు, గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీలు, వేషధారణ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు.



రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యాన అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఏడాది పొడవునా ప్రతినెలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళ సాగే నృత్య ప్రదర్శనలు, కోలాటం, సుద్దులు ప్రదర్శన, బృంద నృత్యాలు, కథాకళి, కూచిపూడి, భరతనాట్యం, ఒడిశా, భోజ్‌పురి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలను మూడు రోజుల పాటు ప్రభుత్వ పండగగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామీణ నేపథ్యంలో సాగే సంగిడిల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు మూడు రోజుల పాటు నిర్వహించారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక శోభ ఉట్టింపడింది. ఆగస్టు 11నుంచి మూడు రోజుల పాటు సంపూర్ణ శతావదానం కార్యక్రమాన్ని నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్ర కళాసమితి ఆధ్వర్యాన నిర్వహించారు. ఏలూరుకు చెందిన వద్దిపర్తి పద్మాకర్ హాజరై సంస్కృతాంధ్ర భాషల్లో అవదానం నిర్వహించారు. అలాగే నవంబరు 23 నుంచి మూడు రోజులపాటు సూర్యదర్శనం ప్రవచనం ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ ఆధ్వర్యాన చేపట్టారు. వీటికి తోడు గ్రామాల్లో ఆషాఢ మాసంలో వివిధ గ్రామ దేవతల ఉత్సవాలు, అరసవల్లి రథసప్తమి వేడుకలు, సాలిహుండం యాత్ర, శ్రీముఖలింగం చక్రతీర్థ స్నానాలు, తొమ్మిది రోజుల పాటు సాగిన జగన్నాథ రథయాత్ర వంటి వేడుకలు ఈ ఏడాది అత్యంత వైభవంగా సాగాయి. పోటాపోటీగా గ్రామ దేవత ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మొత్తం మీద ఏడాది పొడవునా సాంస్కృతిక రంగం ప్రజలకు కనువిందు చేశాయి.



నాటకలో ఓ సన్నివేశం (ఫైల్)


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామ్మోహన్ నాయుడు

యుటిఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

యుటిఎఫ్ మహాసభల పోస్టరును కేంద్ర పౌర విమానయనశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. జనవరి 5 నుంచి 8 వరకు కాకినాడలో యుటిఎఫ్ స్వర్ణోత్సవాలకు హాజరుకావాలని కేంద్రమంత్రికి ఆహ్వానం పత్రిక అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి జి.నారాయణరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సురేష్, డి.గణపతి, ఎం.మన్మథరావు, పి.సింహాచలం, ఎల్.కోదండరామయ్య, పాపారావు పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

జీడి కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ లేబర్ కాలనీ మంకినమ్మ ఆలయం ఆవరణలో లండ రవణ ఆధ్యక్షతన జీడి కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. జీడి కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ గ్రాడ్యూటీ అమలు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించాలని నిర్ణయం తీసుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జీడి కార్మిక సంఘం అధ్యక్షునిగా శిష్టు గోపి, ఉపాధ్యక్షునిగా లండ రమణ, ప్రధాన కార్యదర్శిగా అంబటి ఆనంద్, సహాయ కార్యదర్శిగా గజ్జి బాలయ్య, కోశాధికారిగా సమ్యాన శాంతమూర్తి, లీగల్ అడ్వైజర్‌గా కొమర దేవరాజు, ముఖ్య సలహాదారుగా బమ్మిడి సంతోష్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సభ్యులు

భవానీశంకర్ మృతి తీరని లోటు

పలాస: శిష్టకరణాల అభివృద్ధికి డబ్బీరు భవానీ శంకర్ కృషి చేశారని, ఆయన మృతి తీరని లేని లోటని శిష్టికరణ సంఘ నాయకులు ఎన్.రమణమూర్తి అన్నారు. కాశీబుగ్గ బిఇటి స్కూల్‌లో శిష్టకరణాల సంఘం ఆధ్వర్యాన ఆదివారం భవానీ శంకర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిష్టకరణం సేవా సంఘం అధ్యక్షునిగా అనేక సేవలు అందించిన ఆయన సేవలు అమోఘమని కొనియాడారు. సంఘ భవనం నిర్మించి అందరికి సేవా ఫలాలు అందించడమే ఆయనకు ఇచ్చిన నివాళి అని అన్నారు. కష్టకాలంలో కూడా అందరినీ సంఘటితం చేశారని, ఒబిసి సాధనకు ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో డబ్బీరు భువనేశ్వర్, విజయ్ కుమార్ పట్నాయక్, సదాశివుని ప్రసాదరావు, డబ్బీరు నాగభూషణరావు, భాస్కరరావు, విజయకుమార్ మహంతి, గోవిందరావు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కరుణాకర్

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని డోకులపాడు పంచాయతీ సర్పంచ్ వడ్డి సరిత కరుణాకర్ ఆధ్వర్యాన ఆదివారం ప్రొక్లెయినర్‌తో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన, ఆలయ సమీపం, ఉప్పాడవారి, వాటర్ ట్యాంక్ వద్ద పేరుకుపోయిన చెత్తను ప్రొక్లెయినర్ తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు. పెద్దవీధిలోని మురుగు కాలువ ఎదురుగా పెద్దఎత్తున పెరుగుపోయిన పొదలు తొలగించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, చెత్త గ్రామం నుంచి దూరంగావేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఢిల్లేశ్వరరావు, కార్యదర్శి యాదవరాజు, వార్డు మెంబర్లు వడ్డి దిల్లేశ్వరరావు, కొవిరి అప్పారావు, యంపల్లా పాపారావు, యలమంచి బాబుజీ, కె.జోగారావు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న రామ కౌండిన్య శిష్య బృందం

అలరించిన నృత్య ప్రదర్శన

ఆమదాలవలస: అంతర్జాతీయ కూచిపూడి స్వర్ణపతాక నృత్యోత్సవాల్లో పట్టణానికి చెందిన శిరిడిసాయి నృత్య నికేతన్ గురువు రామ కౌండిన్య శిష్య బృందం నృత్య ప్రదర్శన చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కృష్ణాజిల్లాలోని కూచిపూడిలో నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నారు. రామకౌండిన్య శిష్యులు రోహిత, మోక్షిత, తనిష్య, హర్షిణి పూర్వీ రాధాగోపాలం, వందేభవానీం అనే అంశాలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో కూచిపూడి గ్రామానికి చెందిన ప్రముఖ నాట్య గురువులు, ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ

సంతబొమ్మాళి: మండలంలోని కొల్లిపాడు సర్పంచ్ గొరుసు సవరయ్య తల్లి చంద్రమ్మ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించి సంతాపం వ్యక్తం చేసి చంద్రమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కాకరపల్లికి చెందిన ముడిదాన సింహాచలం కుమారుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబానికి, వడ్డివాడకు చెందిన మెండ సింహాచలం మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈయనతో వైసిపి నాయకులు నక్క భీమారావు, మార్పు నాగభూషణరావు, దుక్క భూషణ్‌రెడ్డి, బొంగు కొండయ్య, నివాస్‌రెడ్డి, సీతారాం, మోహన్‌రెడ్డి, పాపారావు పాల్గొన్నారు.

అధికార పార్టీ కక్షసాధింపు

జగన్నాథపురం సర్పంచ్ రాములమ్మ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో తీర ప్రాంతమైన జగన్నాథపురం సర్పంచ్‌గా ఎన్నికైన తరువాత రాజకీయంగా తనను ఎదుర్కొనలేక ఆస్తులపై తమ ప్రతాపాన్ని టిడిపి నాయకులు చూపిస్తున్నారని సర్పంచ్, బాధితురాలు జోగి రాములమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యాన రెవెన్యూ సిబ్బంది పోలీసుల సహాయంతో సంఘటనా స్థలానికి ఆదివారం చేరుకున్నారు. ప్రొక్లెయినర్ సహాయంతో 180 కొబ్బరి మొక్కలను ఆమె ముందే ఎదుటే తొలగించారు. దీంతో ఆమె విలేకరులతో మాట్లాడారు. రుంకుహనుమంతపురం రెవెన్యూ గ్రూపు పరిధిలో సర్వే నంబరు 315లో 55 సెంట్లు భూమి 1972 నుంచి తాతల తండ్రుల కాలం నుంచి తమ ఆధీనంలో ఉందన్నారు. అప్పటి నుంచి వ్యవసాయం ఆ భూమిలో సాగు చేసే వారుమని తెలిపారు. ఆ భూమికి వర్షాధారం కావడంతో పంటలు సరిగా పండేవి కావదేవి అన్నారు. దీంతో ఆ భూమిలో రూ.3.50 లక్షలు మట్టి వేసి ఎత్తు చేశామని అన్నారు.

మూడేళ్ల కింద ఉపాధి హామీలో భాగంగా 180 కొబ్బరి చెట్లను నాటి సాగు చేశామని చెప్పారు. అయితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తనపై కక్ష సాధింపు చర్యలకు మాజీ సర్పంచ్ పుక్కళ్ల శ్రీనివాసరావు, కొమర రామారావు, జయప్రకాష్, మైలపల్లి కాళిదాసు పూనుకున్నారని వాపోయారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికారులను అస్త్రాలుగా వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటిగా తమ రొయ్యల చెరువులకు విద్యుత్ నిలుపుదల చేయించి సాగు చేయకుండా అడ్డుకున్నారని అన్నారు. అంతటితో ఆగకుండా తన ఆస్తులపై టిడిపి నాయకులు కన్ను పడిందని విమర్శించారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లనని తెలిపారు. అధికారులకు ఎంత నచ్చజెప్పినా వినిపించుకోకుండా అధికార పార్టీ నాయకులు అప్పగించిన పనిని పూర్తి చేశారని వాపోయారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ అది ప్రభుత్వ భూమి అని, అందుకే మొక్కలను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం, ఆర్ఐ ప్రసన్నలక్ష్మి, విఆర్ఒలు పాల్గొన్నారు.


మొక్కలను తొలగించవద్దని కోరుతున్న సర్పంచ్ రాములమ్మ

తెలుగు మహాసభలో రచయితలకు సన్మానం


రణస్థలం : ఈ వేమనకు సన్మానం చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రపంచ తెలుగు మహాసభల్లో యువ కవులకు రచయిత కవి కుప్పిలి వెంకట రాజారావు శిక్షణను అందించారు. ఆదివారం విజయవాడలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో యువ కవులకు కవిత్వం ఎలా రాయాలన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. ఆమదాలవలస పట్టణానికి చెందిన రాజారావును నిర్వాహకులు రమేష్ బాబు సన్మానించారు.

పొందూరు: ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో పొందూరుకు చెందిన రచయిత శ్రీశ్రీ కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు సీయ కవితాగానం చేశారు. సినీగేయ రచయిత భువనచంద్ర, లెనిన్ శ్రీనివాస్ తదితరులు రాజారావు మాస్టర్‌కు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

రణస్థలం: ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో కొండములగాం ఆదర్శ పాఠశాల ఉద్యోగి, ప్రముఖ కవి, కవితామయం అధ్యక్షులు మహ్మద్ రఫీ (ఈవేమన) యువకవులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మహమ్మద్ రఫీ (ఈవేమన)కు అధ్యక్ష, కార్యదర్శులు జి.సుబ్బారావు, డా.పూర్ణచంద్, నిర్వాహక సభ్యులు భవిష్య, ఎన్.రమేష్ ఘనంగా సన్మానించారు.

పలాస: విజయవాడ కేబిన్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహా సభలో పలాసకు చెందిన రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తికి సన్మానించారు. కవి సమ్మేళనంలో పాల్గొని కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని సినీ గేయ రచయిత రస రాజు, లెనిన్ శ్రీనివాస్, సాహిత్యకారులు కిలపర్తి దాలినాయుడు, చిన్నా వెంకట్రామయ్య సన్మానించి జ్ఞాపికను అందజేశారు.కృష్ణమూర్తికి పలువురు అభినందనలు తెలిపారు.


శ్రీకాకుళం అర్బన్ : సత్కారాన్ని స్వీకరిస్తున్న కుమార్ రాజు

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ తెలుగు రచయితల మహసభల్లో జరిగిన కవి సమ్మేళనంలో కవి బుర్రి కుమార్ రాజు రచించి కవితా గానం చేసిన అమరావతి కవిత సభికుల ప్రసంసలందుకుంది. ఈ సందర్భంగా సభా నిర్వాహకులు, సినీ గేయ రచయిత రస రాజు, లెనిన్ శ్రీనివాస్, కొంపెల్లి రామయ్య, కవులు, రచయితలు కుమార్ రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షులు జంధ్యాల శరత్ బాబు, ఉమా కవి, దుర్గా ప్రసాద్, వావిలపల్లి రాజారావు, శ్రీరాములు తదితరులు శుభా కాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని రాజపురం సబ్ స్టేషన్ పరిధిలోని బైరిపురం 11కెవి ఫీడర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు మార్పులు కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా బైరిపురం, నెలవంక, కపాసుకుద్ది పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు, రాజపురంలోని శ్రీశయణ వీధికి విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సహక రించాలని కోరారు.

రేపు ప్రపంచ వికలాంగుల దినోత్సవం

టెక్కలి రూరల్ : టెక్కలి ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మైదానంలో ఈ నెల 31న ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని వికలాంగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ఆవులు వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వికలాంగుల అందరూ హాజరై సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

అమ్మవారి పండగకు సిద్ధం

పాతపట్నం: మండలంలోని తెంబూరులో తొమ్మి దేళ్లకోసారి నిర్వహించే చింతల పోలమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడానికి పెద్దలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సర్పంచ్ బెనియా వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. మే 2 నుంచి 6 వరకు ఐదురోజుల ఉత్సవాలను నిర్వహించ డానికి గ్రామపెద్దలు ఖరారు చేశారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పలాస : నూతన రోడ్లతో బొడ్డపాడు సుందరంగా తయారవుతుందని తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కిరి ఢిల్లీరావు అన్నారు. గ్రామంలో ఆదివారం సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడ్డపాడులో ఇప్పటి వరకు సిసి రోడ్ల నిర్మాణానికి రూ.96 లక్షలు, బిటి రోడ్డు నిర్మాణానికి రూ.1.96 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు ధన్యవాదాలు తెలిపారు.


సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- పొందూరు

మండలం కింతలిలో స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో టిడిపి సభ్యత్వం రెన్యువల్‌తో పాటు నూతనంగా సభ్యత్వం నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ దవళ గణపతిరావు, టిడిపి నాయకులు శేఖర్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- లావేరు:

మండలం తామాడ పంచాయతీ రాయనింగారి పేటకు చెందిన జగ్గురోతు సత్యనారాయణ (30) మనస్థాపానికి గురై ఆదివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు సత్యనారాయణ వ్యక్తిగత కారణాల వలన తీవ్ర మనస్థాపానికి గురై తన ఇంటి వద్ద పొలానికి వేసేందుకు తెచ్చిన పురుగుల మందును శనివారం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ జగన్మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

30 శాతం ధాన్యం కొనుగోలు

సోంపేట: మండలంలోని ఇప్పటివరకు 30 శాతం ధాన్యం కొనుగోలు చేపట్టామని తహశీల్దార్ అప్పలస్వామి, ఎఒ నరసింహమూర్తి తెలిపారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, మిల్లుల యజమానులతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సీజన్‌కు సంబంధించి కనీస మద్దతు ధరతో 30 శాతం ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. 9 ఎకరాలకు 18,267 టన్నుల ధాన్యం సేకరణకు అంచనా వేయగా, ఇప్పటివరకు ఐదు వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సంక్రాంతిలోపు 80 శాతం కొనుగోలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం మిల్లులకు పంపించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేశామన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డిటి కూర్మారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

గత ప్రభుత్వ విధానాల వల్లే ఛార్జీల పెంపు

పాతపట్నం: గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో చేసిన తప్పుడు విధానాలు వల్లే విద్యుత్ ఛార్జీలు పెంపు అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంలో నియోజకవర్గంలోని నాయకులతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు ఈ ఐదేళ్లలో విద్యుత్ కొనుగోలులో మాజీ సిఎం జగన్ చేసిన అవినీతి వల్లే రాష్ట్రంలో రూ. 1,29,000 కోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై పడ్డాయని ఆరోపించారు. జగన్‌కు అవగాహనలేని పరిపాలన వల్ల రాష్ట్రాన్ని అధోగతి పాలైందని విమర్శించారు. ఇప్పుడు వైసిపి నాయకులు ఆందోళనలు, నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, మండల అధ్యక్షుడు పైల బాబ్జి, కొత్తూరు టిడిపి నాయకులు లోతుగడ్డ తులసీవరప్రసాద్, సలాన మోహనరావు పాల్గొన్నారు.


బురద రామచంద్రపురం కూడలి

బస్ షెల్టర్ లేక అవస్థలు

మెళియాపుట్టి: మండలంలో పలుచోట్ల బస్ షెల్టర్ సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం వేచి ఉండే సమయాల్లో షెల్టర్ సౌకర్యం లేక ఎండా, వానలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మండలంలోని బురదరామచంద్రాపురం, ఎగువ జాడుపల్లి, పదనాపురం, బంజీరు కూడలి వద్ద బస్సుషెల్టర్ సౌకర్యం లేదు. సిరియాకండి వద్ద ఉన్న బస్సుషెల్టర్ పూర్తిగా శిథిలమైంది. బస్సుషెల్టర్ సౌకర్యం అభివృద్ధి చేసేందుకు అధికారులు, పాలకులు దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

జగ్గారావుకు ఆర్థికసాయం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

జిబి సిండ్రోమ్ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని జి.కరాపాడుకు చెందిన నర్తు జగ్గారావుకు ఎస్‌జిఎఫ్ అండగా నిలిచింది. ఇద్దరు చిన్నారులతో రెక్కాడితే గాని డొక్కాడని వలస కూలీ జగ్గారావు దయనీయ పరిస్థితిని 'అయ్యో.. ఎంత కష్టం' అంటూ 'ప్రజాశక్తి' కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన ఎస్‌జిఎఫ్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని జగ్గారావును పరామర్శించారు. మంచానికే పరిమితమైన జగ్గారావుకు భరోసా కల్పించారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ దయనీయ పరిస్థితుల్లో ఉన్న జగ్గారావు కుటుంబానికి దాతలు అండగా నిలవాలని కోరారు. ఆర్థికసాయం అందించాల్సిన సభ్యులు జగ్గారావు బ్యాంకు అకౌంట్ నంబరు 20027694352, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐ ఎన్0008820, ఫోన్ పే నంబరు 8179389330కు సహాయాన్ని అందించాలని కోరారు.

ఇచ్ఛాపురం : మండలంలోని కేదారిపురానికి చెందిన బుక్త కృష్ణమూర్తి భార్య దేవకికి గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రూ.42 వేలు ఆర్థికసాయం అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రెండు నెలల క్రితం దేవికి నిచ్చెన ఎక్కుతూ కిందకు జారిపడి గాయపడింది. ఈ ప్రమాదంలో నడుము, కాళ్లు పనిచేయడం లేదు. దీంతో వైద్య చేయించడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు.

తమ్మినేనికి బొత్స పరామర్శ

ఆమదాలవలస: పట్టణంలోని పూజారిపేటలో ఉన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం స్వగృహానికి వచ్చి తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్‌ను మాజీమంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగృహానికి చేరుకోవడంతో ఆయన చిరంజీవి నాగ్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బయటకు వచ్చిన సందర్భంగా విజయనగరం జిల్లాకు చెందిన ఓ మంత్రి (కొండపల్లి శ్రీనివాస్) బొత్స సత్యనారాయణ కాళ్లకు నమస్కారం చేయడంపై పెద్ద దుమారం రేగిందని ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయనున్నట్లు వార్తలు కూడా వచ్చాయని దీనిపై మీ స్పందన ఏమిటని విలేఖరులు ప్రశ్నించగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కౌగిలించుకున్నానని ఆయనను కూడా బర్తరఫ్ చేస్తారా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఇవన్నీ సహజమన్నారు.


తమ్మినేనితో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

పార్టీ మార్పుపై స్పందించిన తమ్మినేని

ప్రతి విషయాన్ని భూతద్దంలో పెట్టి చూస్తున్నారని ఇటీవలే తన కుమారుడు చిరంజీవి నాగ్‌ను ఆస్పత్రిలో చేర్పించి గడచిన 15 రోజులుగా అక్కడే ఉన్నామని అందు వలనే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నామని వైసిపిలో అందరం కలిసికట్టుగా పనిచేస్తామని సీతారాం తెలిపారు.

ఘనంగా జైభీమ్ వార్షికోత్సవం

సోంపేట: జై భీమ్ సేన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డుమీదుగా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మధ్యలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షుడు డాక్టర్ నగిరి మోహనరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త జి.జయరాజ్, దిగంబర్ కాంబ్లి మాట్లాడుతూ రాజ్యాంగం - అంబేద్కర్, భారతదేశం - అంబేద్కర్ అన్న అంశాలపై వివరించారు. సంస్థ ప్రతినిధులు ఎం.రవి సిద్ధార్థ, బి.ఈశ్వరరావు, ఎన్.బాబూరావు, ఎన్.బెనర్జీ, ఎన్.కాళిదాసు, ఎం.హరీష్‌కుమార్ పాల్గొన్నారు. ముందుగా దళిత సంఘ నాయకులు కె.రాంగోపాల్, సిహెచ్. దేవరాజులకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

పిఆర్ డిప్లమో ఇంజినీర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహంతి


మహంతిని సత్కరిస్తున్న ఇంజినీర్లు

శ్రీకాకుళం అర్బన్: పంచాయితీ రాజ్ డిప్లమో ఇంజినీర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కెసిహెచ్ మహంతి ఎన్నికయ్యారు. తిరుపతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన్ను సభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయనను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పిఆర్ డిప్లమో ఇంజినీర్ల సంఘం ఉపాధ్యక్షులు ఎం.పోలినాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, టెక్కలి ఇఇలు ఎస్ రామకృష్ణ, ఎఎస్ ప్రకాశరావుతో పాటు ఉద్యోగ విరమణ చేసిన పూర్వపు ఇఇలు ప్రభాకరరావు, జిఎస్ఆర్ గుప్త, కెఎంవి ప్రసాదరావు, పంచాయతీరాజ్ జెఎసి చైర్మన్ ఎస్.శ్రీరాములు అభినందించారు. ఉద్యోగుల సమస్యలపై నిరంతరాయంగా పనిచేస్తూ సహోద్యోగుల క్షేమాన్ని కోరుకునే వ్యక్తి మహంతి అని కొనియాడారు. రాష్ట్రస్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని వారు కోరారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీత కెసిహెచ్ మహంతి మాట్లాడుతూ తన ప్రతి అడుగు ఉద్యోగుల ప్రయోజనం కోసమే పని చేస్తానన్నారు.

తేజేశ్వరరావుకు పితృవియోగం


శ్రీరామ్మూర్తి (ఫైల్)

శ్రీకాకుళం అర్బన్: సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తండ్రి పేకల శ్రీరామ్మూర్తి (88) ఆదివారం అనారోగ్యంతో కన్ను మూశారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆయన సోదరుడు ఇంట్లో నివాసముంటున్నారు. ఆయన స్వస్థలం లావేరు మండలం మురపాక గ్రామం. ఆయనకు ఆరుగురు సంతానం. పెద్దకుమారుడు నైలాన్ ఫ్యాక్టరీలో పని చేస్తుండగా రెండో కుమారుడు మార్కెటింగ్ విభాగంలో కొనసాగుతున్నారు. మూడో కుమారుడు తేజేశ్వరరావు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ముగ్గురు కుమార్తెలు కూడా ఉన్నారు. స్వస్థలం మురపాకలో చిన్ననాటి నుంచి కిరణా వ్యాపారం చేస్తున్న శ్రీరామ్మూర్తి స్థానికంగా అందరికి చిరపరియస్తుడు. ఇటీవలే ఆయన తన పెద్ద కుమారుని ఇంటికి వచ్చి వారితో ఉంటున్నారు. గడచిన మూడు రోజులుగా అస్వస్థతకు గురైన ఆయన ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందారు. ఆయన మృతికి సిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అలమాజీపేటలో అపారిశుద్ధ్యం


కాలనీ రోడ్డులో చెత్తా చెదారాలు


ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని ఎమ్మెల్యే కూన రవికుమార్ స్వగ్రామమైన పెనుబర్తి పంచాయితీ పరిధిలోని అలమాజీపేటలో అపారిశుధ్యం తాండవిస్తుంది. గ్రామంలో ఏ వీధి రహదారులు చూసినా చెత్తా చెదారాలు, మురుగుతో దర్శనమిస్తున్నాయి. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు రహదారిపై నిలిచిపోయి దుర్గంధంతో పాటు దోమల బెడద ఎక్కువై రోగాలు బారిన పడుతున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపైనే ముళ్లకంపలు, పశువులను కట్టివేస్తుండడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితులు నెలకొన్నాయని, అలాగే రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో విష కీటకాల ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే స్వగ్రామాన్నే అధికారులు పట్టించుకోకపోతే మరెక్కడ పట్టించు కుంటారంటూ పలువురు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రహదారిపైనే పశువులను కట్టిన స్థానికులు

తాగునీటి పైపులైన్ లీకు

- వృధాగా పోతున్న తాగునీరు
- రెండు నెలలుగా పట్టించుకోని అధికారులు


లీకవుతున్న తాగునీటి కుళాయి

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీ పెద్దవీధిలో రక్షిత తాగునీటి పథకం ద్వారా వచ్చే పైపులైన్ లీకై తాగునీరు వృధాగా పోతుంది. రెండు నెలలుగా సమస్య ఆలాగే కొనసాగుతుంది. నీరు వృధాగా పోవడంతో పాటు పైపులైన్ మురుగు కాలువను అనుకుని ఉండడంతో లీకైన పైపు ద్వారా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం పొంది ఉంది. ఇటీవల విజయనగరం జిల్లా గుర్లలో ఇటువంటి లీకేజీ ద్వారా నీరు కలుషితమై 16 మంది వరకు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. దీంతో పెద్దవీధి ప్రజలు నిత్యం ఈ లీకేజీతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పంచాయతీ పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. స్థానికులు రబ్బరు ట్యూబులు కట్టి తాత్కాలికంగా అరికట్టినా ఫలితం ఇవ్వడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లీకేజీని అరికట్టి వృధాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆ వీధివాసులు కోరుతున్నారు.


పెద్దవీధిలో పైపు లీకేజీతో వృధాగా పోతున్న తాగునీరు